




చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు

సంస్కతీ, సంప్రదాయాలకు దర్పణం పట్టే చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచి, చేనేత వత్తిని, వారి ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించాలని జిల్లా కె.వి.ఎన్. చక్రధర్ బాబు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర చేనేత, జౌళి సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియం లో ఏర్పాటు చేసిన " స్టేట్ హ్యాండ్ లూమ్ ఎక్స్ పో -2023" చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, కొన్నేళ్లుగా చేనేత వత్తిని నమ్ముకుని జీవించే చేనేత కార్మికులకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా బాసటగా నిలుస్తున్నవన్నారు. జిల్లాకు ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయి చేనేత వస్త్ర ప్రదర్శనను కేటాయించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలుపుతూ, ఈ విధమైన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించి స్టాల్స్ ను ఏర్పాటుచేయడంటం వల్ల చేనేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఈ చేనేత వస్త్ర ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ప్రదర్శించబడుచున్నవని, ప్రజలు చేనేత వస్త్రాలను విరివిగా కొనుగోలు చేసి చేనేత కార్మికులను తమ వంతుగా ప్రోత్సాహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా చేనేత, జౌళి శాఖ, సెట్నల్, నాబార్డు వారి సహకారంతో ఈ చేనేత వస్త్ర ప్రదర్శన అమ్మకం ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు రెండు వారాలు పాటు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చేనేత వస్త్రాల కొనుగోలుతో చేనేత వత్తిని ప్రోత్సహిస్తూ వారి ఆర్థికాభివద్ధికి దోహద పడాలని ఆయన ప్రజలను కోరారు. జిల్లా చేనేత జౌళి శాఖాధికారి ఆనందకుమార్, సెట్నల్ సిఈఓ పుల్లయ్య, నాబార్డు ఎజిమ్ రవి సింగ్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య పాల్గొన్నారు.

నేడు ఓట్లు లెక్కింపు..!

తూర్పురాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎన్నికల ఓట్లు లెక్కింపు నేడు జరగనుంది. రాష్ట్ర వ్యాపితంగా ఫలితాల కోసం ఉత్కంఠ నెలకొంది. ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసి, తామే గెలుస్తామని వైసిపి హడావుడి చేస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకత, ప్రజాస్వామ్యవాదులు ,ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ తమ వైపు ఉన్నారని పిడిఎఫ్ నేతలంటున్నారు. ఓట్లు లెక్కింపులో తుది ఫలితాలు రావడానికి రెండు రోజులు పట్టే అవకాశముంది. గ్రాడ్యుయేట్‌కు 40, టీచర్స్‌కు 14 టేబుళ్ల ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి చిత్తూరులోని ఆర్‌విఎస్ లా కాలేజీలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

- రాష్ట్ర వ్యాపితంగా ఉత్కంఠ
- ఫలితాల కోసం రెండు రోజులు
- పట్టభద్రులకు 40, టీచర్స్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు



చిత్తూరులోని ఆర్‌విఎస్ లా కాలేజీలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసిన దృశ్యం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

తూర్పు రాయలసీమ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో భారీగా పోలింగ్ జరిగింది. గ్రాడ్యుయేట్‌కు సంబంధించి 63.82 శాతం పోలింగ్ జరిగింది. టీచర్స్ ఎన్నికలకు సంబంధించి 88.36 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలోని కందుకూరు, కావలి, ఆత్మకూరు, నెల్లూరు డివిజన్ పరిధిలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 1,07,632 మంది ఓటర్లు ఉండగా, అందులో 68,695 ఓట్లు పోలయ్యాయి. టీచర్స్ ఓటర్లు 8165 మంది ఓటర్లు ఉండగా, 7,215 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం చిత్తూరులోని ఆర్‌విఎస్ లా కాలేజ్‌కు బ్యాలెట్ బాక్సలు తరలించారు. నేడు ఉదయం 8 గంటలకు ఓట్లు లెక్కింపు ప్రారంభమౌతోంది. గ్రాడ్యుయేట్‌కు సంబందించి 40, టీచర్స్‌కు సంబందించి 14 టేబుళ్ల ఏర్పాటుచేశారు. కౌంటింగ్ కోసం 916 మంది సిబ్బందిని నియమించారు. తూర్పు రాయలసీమ (చిత్తూరు, నెల్లూరు,ప్రకాశం) ఎంఎల్‌సి .ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు రిటర్నింగ్ అధికారి యం. హరినారాయణన్ తెలిపారు. పట్టభద్రుల ఎం.ఎల్.సి ఎన్నికలకు సంబం ధించి తిరుపతిలోని 229, 233 పోలింగ్ స్టేషన్ల లో ఈ నెల 15న రీ పోలింగ్ నిర్వహించారు. నేడు చిత్తూరు ఆర్.వి.ఎస్. లా కాలేజ్‌లో ఉపా ధ్యాయ ఎం.ఎల్.సి., ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందికి అవస రమైన శిక్షణ ఇచ్చారు. గ్రాడ్యుయేట్, టీచర్ల ఎం.ఎల్.సి. కౌంటింగ్ కోసం 40 టేబుళ్ల, ఉపాధ్యాయ ఎం.ఎల్.సి కౌంటింగ్ కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో 193 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 916 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. తొలి ప్రాధాన్యత ఓటుతో ఎవరూ గెలిచే పరిస్థితులు కనిపించడం లేదు. రెండో ప్రాధాన్యత ఓటుతో ఎవరైనా గెలుస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓట్లు లెక్కింపు కనీసం రెండు రోజులు పట్టే అవకాశముంది. నెల్లూరు నుంచి వైసిపి, టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లు చిత్తూరు బయలు దేరి వెళ్లారు.



ఓట్లు లెక్కింపునకు కౌంటర్ ఏర్పాటు చేసిన దృశ్యం



మాట్లాడుతున్న కమిషనర్ హరిత

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి, కుళాయి, డ్రెయిన్; ఖాళీ స్థలం, వాణిజ్య ప్రకటనల పన్నులతో పాటు ప్రతి ఇంటి నుంచి యూజర్ చార్జిల వసూళ్లకై నిర్దేశించి లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు.బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నగర పాలక సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ సేవలను నిర్దిష్ట సమయంలోపు పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. నగర పాలక సంస్థ జారీ చేసే ట్రేడ్ లైసెన్స్ ల ఆవశ్యకతపై వ్యాపార వర్గాలకు అవగాహన పెంచి, నగర వ్యాప్తంగా అన్ని షాపులను లైసెన్సుల పరిధిలోకి తేవాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో (క్లాప్) భాగంగా ప్రతి ఇంటినుంచి ప్రణాళికాబద్ధంగా చెత్తను సేకరించాలన్నారు. సచివాలయాల వారీగా నిర్దేశించి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచర్ల శ్రీకాంత్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-నెల్లూరు : శాసనమండలి ఎన్నికల సందర్భంగా డికెడబ్ల్యూ కళాశాల ఆవరణంలో పోలీసులతో టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ దురుసుగా వ్యవహరించడమే కాకుండా ఎన్నికల నియమనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద పచ్చ కండువా వేసుకొని తిరుగుతూ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగిస్తూ దురుసుగా వ్యవహరించాడన్న ఆరోపణతో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 839 విద్యార్థులు గైర్హాజరు



పొదలకూరులో...

ప్రజాశక్తి-నెల్లూరు :ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల మొదటి రోజు 839 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కన్వీనర్ టి.వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విద్యార్థులు 27,151 మంది హాజరు కావాల్సి ఉండగా 26,464 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. 687 మంది హాజరు కాలేదన్నారు. ఇంటర్ వృత్తి విద్యానభ్యసించే విద్యార్థులు 1,714 మందికి గాను 1,562 మంది పరీక్షలు రాయగా 152 మంది గైర్హాజరై య్యారన్నారు. ఇంటర్ బోర్డు అధికారి ఎస్.శేషుకుమారి, కావలి, బిట్రగుంట ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, జిల్లాలో 75 పరీక్షా కేంద్రాలను ఇంటర్ పరీక్షల కన్వీనర్ టి.వరప్రసాద్, అబ్జర్వర్ కె.మధుబాబు, పరీక్షల కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. బిట్రగుంట పరీక్షా కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ కేసు ఒకటి నమోదైంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ , సంస్కృతం, వృత్తి విద్యా జిఎఫ్‌సి (జనరల్ ఫౌండేషన్ కోర్సు) సబ్జక్టుల పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

పొదలకూరు :పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిఎన్ఆర్ జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో 478 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు జరగాయి. పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలికి అనుమతి లేకపోవటంతో విద్యార్థులంతా తొందరగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.

జాతీయ భద్రతా వారోత్సవాలు..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని సెంబ్కార్ప్ ఎనర్జి ఇండియా లిమిటెడ్ కంపెనీలో బుధవారంతో జాతీయ భద్రత వారోత్సవాలు ముగిశాయి. కంపెనీ భద్రత విభాగం ఆధ్వర్యంలో జాతీయ భద్రత వారోత్సవాలు జరిగాయి. ముగింపు కార్యక్రమంలో కంపెనీ విభాగాధిపతులు, ఉద్యోగులు, సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు. కంపెనీ ఆపరేషన్స్ హెడ్ ప్రవీ ణ్ సుంకర, మెయింటెనెన్స్ హెడ్ గౌతమ్ నయన్, హెచ్ ఆర్ హెడ్ శంకర్ ప్రసాద్ ప్రసంగించారు. పని ప్రదేశంలో ఉద్యోగులు, సిబ్బంది తీసు కోవాల్సిన జాగ్రత్తలు, భద్రత ప్రాముఖ్యత గురించి సూచన లు చేశారు.

అనుమానితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు :మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి తనపై సోషల్ మీడియా (ఫేస్ బుక్ ఖాతా) లో అసభ్య పదజాలంతో సందేశాలు, పోస్టింగ్‌లు పెడుతున్నారంటూ బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి స్వయంగా విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా అనుమానితుడు గా వెంకట సాయి మనోజ్ గా గుర్తించి అదుపులోకి తీసుకొని ఐటి యాక్ట్ కింద కేసు నమోదు చేసి 6వ నగర పోలీసు స్టేషన్ కు తరలించి విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఇంతియాజ్‌కు స్వాగతం




ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి, అడిషినల్ సిసిఎల్ఎను ఇంతియాజ్‌ను మర్యాద పూర్వకంగా కార్పోరేషన్ కమిషనర్ డి.హరిత మర్యాద పూర్వకంగా కలిశారు. కొడవలూరు మండలం, నార్త్ రాజుపాళెం ప్రాంతంలోని వెంకటేశ్వర కళాశాలలో ఏర్పాటు చేసిన పొదుపు మహిళల ఆస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఆయన నగరానికి వచ్చారు. నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్లో ఎండి. ఇంతియాజ్‌ను డి.హరిత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కందుకూరు : పాలిటెక్నిక్ కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు ఏప్రిల్ 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కందుకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె మస్తానయ్య తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశం కోసం మే 10వ తేదీన జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాల్సిందిగా ఆయన సూచించారు.

సిఎంను కలిసిన 'తూమాటి'



ప్రజాశక్తి -కందుకూరు :ఎంఎల్‌సి తూమాటి మాధవరావు బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమ రావతిలో ముఖ్య మంత్రిని కలిసి మాధవ రావు కొన్ని సమస్యలను వివరించడం జరిగింది.

టిడిపి కార్యకర్తకు పరామర్శ



ప్రజాశక్తి -కందుకూరు : మండలం పెద్దలాటిరిపి గ్రామానికి చెందిన దాసరి యల్లమందయ్య అనే టిడిపి కార్యకర్త పురుగుల మందు తాగి ఒంగోలు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూన్నాడని తెలిసి నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఇంటూరు రాజేష్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. యల్లమందయ్యకు మెరుగైన వైద్యం అందించాలని ఆర్థిక సాయం ఇంటూరి రాజేష్ చేశారు. టిడిపి నాయకులు మువ్వా మల్లికార్జున, బత్తిన వెంకటేశ్వర్లు ఉన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :పేదలకు గూడు వసతి కల్పించే ఉద్దేశ్యంతో నిర్మిస్తున్న గహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ పిడి వెంకట రామ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని ఇస్కపాలెం, కోవెరపాలెం, కొత్తపాలెం, వెంకన్న పాలెం గ్రామాల్లోని జగనన్న లే అవుట్లను పరిశీలించారు. హౌసింగ్ ఈఈ నాగరాజు, డిఇ వరప్రసాద్, ఏఇ ముక్తార్ బాషా, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కన్నం హేమలత, ఇఒపిఆర్‌డి నారాయణ రెడ్డి, ఎపిఎం శైలజ ఉన్నారు.

అటవీ భూమిలో గ్రావెల్ అక్రమ తరలింపు

అధికారుల మౌనంపై విమర్శలు



అటవీ భూమిలో గ్రావెల్ తరలిన దృశ్యం

ప్రజాశక్తి - గుడ్లూరు

మండలంలో విస్తారంగా ఉన్న అటవీ భూముల్లో నుంచి విలువైన గ్రావెల్ (ఎర్రమట్టి) గత కొంతకాలంగా అక్రమంగా తరలిస్తున్నారు. ఫారెస్ట్ అధికారుల అండదండలతోనే కొందరు కాంట్రాక్టర్లు జెసిబిల సాయంతో ట్రాక్టర్లతో యథేచ్ఛగా ఎర్రమట్టి ఇతర ప్రాంతాలకు తరలించి జేబులు నింపుకుంటున్నారు. సమీప గ్రామస్తులు అరోపిస్తున్నారు. ముడుపులకు అలవాటు పడి అటవీ అధికారులు గ్రావెల్ అక్రమ తరలింపుపై మౌనంగా ఉంటున్నారని శాంతినగర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని శాంతినగర్ దగ్గర నుంచి జాతీయ రహదారి కి ఎదురుగా పొట్లూరు బీట్ పరిధిలో ఉన్న వాయిల చెరువు దగ్గర రిజర్వు ఫారెస్ట్ భూమిలో విలువైన ఎర్రమట్టిని అడ్డదారులగుండా గుడ్లూరు మండలం, ఇతర ప్రాంతాలకు ఎర్రమట్టి తరలిపోతుంది. ఈ గ్రావెల్‌ను కొందరు కాంట్రాక్టర్లు సమీప గ్రామాలకు తరలించి ఇళ్ల ప్లాట్లు యజమానులకి అమ్ముకుంటున్నట్లు తెట్టు శాంతినగర గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా గ్రావెల్ అక్రమ తరలింపు, జామాయిల్ కర్ర అక్రమ అమ్మకాలను అడ్డుకోవాలని ఉన్నతాధికారులకు పొట్లూరు, శాంతినగర్, తెట్టు గ్రామస్తులు కోరుతున్నారు.

'ఉపాధి' నిధులపై ఎంపి 'వేమిరెడ్డి' ప్రశ్న

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : పార్లమెంట్‌లో రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మెటీరియల్ కాంపోనెంట్ కింద ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వం రూ 700 కోట్లు చెల్లించాల్సి ఉందనే విషయం వాస్తవమేనా అని ప్రశ్నించారు. 01-03-2023 నాటికి ఆంధ్రప్రదేశ్‌కి చెల్లించాల్సిన బకాయిలు, ఇతర బకాయిల వివరాలు తెలపాలని బుధవారం రాజ్య సభలో కోరారు. బకాయిలను క్లియర్ చేయకపోవడం వల్ల రాష్ట్రంలో ఈ పథకం అమలుపై ప్రభావం చూపుతుందా అని అన్నారు. మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన మెటీరియల్, వేతన బకాయిలు ఏమైనా ఉంటే ఎప్పటిలోగా క్లియర్ చేస్తుందో తెలపాలని ప్రశ్నిం చారు. స్పందించిన కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి సమాధానమిచ్చారు. మహా త్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది డిమాండ్-ఆధారిత వేతన ఉపాధి పథకం.అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23 లో (10.03.2023 నాటికి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ. 6706.08 కోట్లు మహాత్మా గాంధీ కింద విడుదలయ్యాయని, ,ఇందులో మెటీరియల్ కోసం మరియు పరిపా లనా భాగాల కోసం రూ. 2363.46 కోట్ల తో సహా. ఈ పథకం కింద, మొత్తం రూ.819.12 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కోసం పెండింగ్‌లో ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు

ధరల స్థిరీకరణపై అవగాహన

ప్రజాశక్తి -కందుకూరు

రైతులకు మేలు జరిగే విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రెగ్యులర్ కొనుగోలు జరిగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జరిగిన ధరల స్థిరీకరణపై సమా వేశంలో ఆయన మాట్లాడుతూ పప్పుధాన్యాల మార్కెట్ నిరంతరం జరిగే విధంగా జిల్లాలోని మూడు మార్కెట్ యార్డ్‌లను ప్రతిపాదించినట్లు చెప్పారు. కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు మార్కెట్ యార్డ్‌లో పప్పు ధాన్యాలను పండించిన రైతులు తీసుకువచ్చి ఉంచితే వాటిని నేరుగా కొనే విధంగా వ్యాపా రులను ఏర్పాటు చేయడంతో పాటు సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు చెప్పారు. వ్యాపా రులకు రైతులకు కూడా ఈ విధానం వల్ల ఉపయోగ ఉంటుందని అంచనాతో ఈ ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రతిపాదనకు ఎంఎల్ఎ మానుగుట మహీధర్ రెడ్డి కూడా సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. తమ వద్ద ఉన్న మినుములను శాంపిల్ తెచ్చి చూపించడం జరిగిందని అయితే ఎవరూ కొనుగోలు చేయలేదని రైతులు చెప్పారు. దాంతో తక్కువ ధరకు అమ్ముకోని నష్ట పోతున్నామని రైతులు సమావేశంలో చెప్పారు. కందుకూరు పరిసర ప్రాంతాల్లో పండించిన వేరుశనకు ఎక్కువ ధర ఇప్పించడానికి మార్కెట్ యార్డ్ చేసిన ప్రయత్నాలను రైతులు సహకరించకపోవడంతో విఫలమైందన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు



మండలంలోని వరకవిపూడిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనంలో బుధవారం నుంచి పరిపాలన ప్రారంభమైంది. సర్పంచ్ ఇసనాక రమేష్ రెడ్డి గిరిజనులకు కొత్తగా మంజూరు చేసిన ఆధార్ కార్డులు , దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు



వైసిపి రాష్ట్ర కార్యదర్శి విజయ డైరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి ని ఆ పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. సుధీర్‌రెడ్డి ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. చికిత్స తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వచ్చిన సుధీర్‌రెడ్డిని వైసిపి నాయకులు, వరకువిపూడి పంచాయతీ సర్పంచ్ ఇసనాక రమేష్ రెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు, కోవెరపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ తలమంచి సురేంద్ర బాబు తదితరులు పరామర్శించారు. అనంతరం సుధీర్ రెడ్డికి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సుధీర్ రెడ్డిని పరామర్శించిన వారిలో నలగట్ల మల్లారెడ్డి, మాజీ జెడ్పిటిసి గంధళ్ల శ్రీనివాసులు, ఎరబోలు రమేష్, వుడతా రాజయ్య, అన్నాబత్తిన క్రిష్ణ, పత్తిపాటి కిశోర్, తుపాకుల కోటేశ్వరరావు, యాటగిరి బాబురావు ఉన్నారు.

మాదక ద్రవాల్యకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -కందుకూరు



కందుకూరు ఎస్ఇబి స్టేషన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అవగాహనా బుధవారం జరిగింది. కందుకూరు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు, ఎస్ ఐ డి. మౌలాలి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, నరేంద్ర, అధ్యాపకులు డి. రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు. మాదక ద్రవాల్యల కు దూరంగా ఉండా లని సూచించారు. మాదక ద్రవ్యాల సరఫరాపై సమాచారం ఉంటే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఎప్పుడు అయినా సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆడిట్‌పై అనుమానాలు

ప్రజాశక్తి -పొదలకూరు :ప్రజలకు, పత్రికా ప్రతినిధులకు, ప్రతిపక్షాలకు ఎవరికీ ముందస్తు సమాచారం లేకుండా, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ ను రహస్యంగా నెల్లూరులోని పీడీ కార్యాలయంలో నిర్వహించడం ఏమిటని టిడిపి మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు ప్రశ్నించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. మండలంలో ఎన్ఆర్ఇజిఎస్ పనుల్లో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగాయన్నారు. ఇప్పటికే తామ నెల్లూరు ప్రాజెక్టు డైరెక్టర్ ,పొదలకూరు ఎంపిడిఓ దష్టికి తీసుకెళ్లామన్నారు. అలాంటప్పుడు ఆయా గ్రామ ప్రజలకు తెలియకుండా, ముందస్తు ప్రకటన లేకుండా రహస్యంగా ఎన్నికల కోడ్ నేపంచుపూతూ, ఆకస్మికంగా పీడీ కార్యాల యంలో నిర్వహిం చడంపలు పట్ల అనుమానాలు ఉన్నాయన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా, పొన్నలూరు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు కనపర్తి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నవులూరి లక్ష్మీ గీత అనే ఆరేళ్ల పాప పుట్టినరోజు సందర్భంగా కందుకూరులో శివాలయం, అంకమ్మ స్వామి దేవాలయం, బస్టాండ్ సెంటర్లో ఉన్నటువంటి అనాథలకు, యాచకులకు, పేదలకు, వద్ధులకు దాదాపు 40 మందికి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. రవ్వ శ్రీనివాసరావు, కనపర్తి మనోజ్ కుమార్, చీదెళ్ల కష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇ సత్యనారాయణ

మెరుగైన విద్యుత్ సరఫరా : ఎస్ఇ

ప్రజాశక్తి -కందుకూరు : పరీక్షలు జరుగుతున్నందున విద్యుత్ అంతరాయం కలగకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎస్ఇ జి సత్యనారాయణ ఆదేశించారు. బుధవారం కందుకూరులో జరిగిన విద్యుత్ అదాలత్ సందర్భంగా ఆయన సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. 10, ఇంటర్ పరీక్షా కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో విద్యార్థులు చదువుకోవడానికి అసౌకర్యం కలగకుండా విద్యుత్తు నిరంత రాయంగా కొనసాగే విధంగా చర్యలు ఉండాలని సూచించారు. విశ్రాంత సీనియర్ జడ్జి ఎస్ విక్టర్ ఇమ్మానుయేల్ విద్యుత్ వినియోగదారుల సమ స్యలను స్వీకరించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి క్లుప్తంగా పరిశీలించి బిల్లులో తేడాలు ఉన్న వాటిని పరిష్కరించారు. డివిజన్ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరయ్య, డీఇలు, ఎఇలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -పొదలకూరు

పట్టణంలోని తహశీల్దార్ కాలనీలోని ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో బుధవారం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి రవి కుమార్ ఇంటింటికి వెళ్లి క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అనేది అంటువ్యాధని ఒకరిద్వారా ఒకరికి సులభంగా వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి ఊపిరితిత్తుల పై ప్రభావం చూపిస్తుందన్నారు. దీర్ఘకాలంగా దగ్గు తగ్గకుండా వుండడం, బరువు తగ్గడం, తరచూ జ్వరం, జలుబు లాంటి లక్షణాలు వున్నవారు వ్యాధి వుందని అనుమానం కలిగిన వారు సమీపంలోని ఏఎన్ఎం లను కానీ, ఆరోగ్య సిబ్బంది ని కానీ సంప్రదించాలన్నారు. వార్డు మెంబర్ గుంటి భాస్కర్, ఆరోగ్య విస్తర ణాధికారి టి. రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు కె.అనురాధ, ఆరోగ్య సహాయ కులు ఎం. రాధా కుమారి, సాని శివప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ టి. సుమాంజలి, ఆశా కార్యకర్త జి. సీత పాల్గొన్నారు.



వినియోగదారుల హక్కులను పరిరక్షించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకొని, వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పాతఊరు మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి సామాజిక వేత్త ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎక్కడ చూసినా తూకాల్లో తేడాలు, ధరల్లో వ్యత్యాసం, కల్తీలో జోరు వల్ల వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఐపిసి 224 సెక్షన్ ప్రకారంగా తూకాల్లో తేడాలు జరిగితే రెండు సంవత్సరాలు జైలు శిక్ష జరిమానా కూడా ఉంటుందని తెలిపారు. ప్రతి వినియోగదారుడు కొనుగోలు చేసే వస్తువులకు రశీదులు తీసుకోవాలన్నారు. నష్టపోయిన వినియోగదారుడు వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి, నష్ట పరిహారం పొందాలని కోరారు. అధికారులు, పౌరసంఘాలు, వినియోగదారులను చైతన్యపరిచి వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు దయాలత, విద్యార్థులు పాల్గొని వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాన్ని అవగాహన చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ కన్సూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం వరికుంటపాడు వారు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎలిమెంటరీ స్కూల్‌ను సందర్శించారు. ముఖ్యంగా వినియోగదారుల ఫోరం గురించి పిల్లలలో అవగాహన కల్పించారు వారు మాట్లాడారు. ఒక వస్తువు కొనుగోలు చేసే ముందు ఆ వస్తువు తయారీ తేదీ గడువు తేదీ చూసుకొని కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో ఈ కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కన్సూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చల్లగాలి వెంకట్ మోహన్, మండల వైస్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాల్లో డిఎంహెచ్ఓ తనిఖీలు



సీతారామపురంలో ...



ఉదయగిరిలో...



మర్రిపాడులో...

ప్రజాశక్తి-సీతారామపురం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య తనిఖీ చేశారు. పిహెచ్‌సిలోని ప్రసూతి గదులను, ల్యాబ్‌ను తనిఖీ చేసి ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలను పెంచాలని, ల్యాబ్‌లో అన్నిరకాల పరీక్షలు చేయాలని సూచించారు. ఫ్లోరోసిస్ బాధిత గ్రామాల నుండి వచ్చిన రోగులతో సమావేశం అయ్యారు. ఫ్లోరోసిస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఫ్లోరోసిస్‌తో బాధపడుతూ నడవలేని నలుగురికి వాకర్స్‌ను అందించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్య, మెడికల్ ఆఫీసర్ స్వప్న, సిహెచ్ఓ బి.మంజుల, ఎంపిహెచ్ఇఓ ఎస్‌కె.అబ్దుల్ మజీద్, ఫార్మసిస్ట్ కృష్ణయ్య సిబ్బంది, ఫ్లోరోసిస్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : గర్భిణులకు, 0–5 చిన్నారులకు సిబ్బంది అందిస్తున్న వ్యాక్సినేషన్‌ను డిఎంహెచ్ఓ పెంచలయ్య ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. బుధవారం స్థానిక బిట్–2 సచివాలయంలో జరుగుతున్న వ్యాక్సిన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు వైద్య సిబ్బందికి చేశారు. అనంతరం జరిగిన సమీక్షలో ఆరా తీశారు. సిబ్బంది 93 శాతం విద్యార్థులకు పంపిణీ చేసామని తెలపడంతో డిఎంహెచ్ఓ సంతృప్తి వ్యక్తం చేశారు. వ్యాక్సిన్ కూడా ఇదేస్థాయిలో నిర్వహించాలన్నారు. రానున్న ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ లవణ ద్రావణ సిద్ధంగా వైద్యశాలలో ఉంచుకోవాలన్నారు. అవసరం ఉంటే ఎండలో బయటికి వెళ్లరాదని తప్ప అనవసరంగా తిరగవద్దని ప్రజలకు కోరారు. మధ్యాహ్నం 12 లోపల పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలన్నారు. ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉన్నాయని ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య, సూపర్వైజర్ అక్బర్ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ఆసుపత్రిలోని వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎండలకు తిరిగి వడదెబ్బకు గురికావద్దన్నారు. వ్యవసాయ కూలీలు, ఇతరులను తమ సొంత పనుల కోసం ఉదయాన్నే వెళ్లి 11 గంటలలోపు ఇంటికి చేరుకోవాలని, బయటకు వెళ్లినప్పుడు గొడుగు నీళ్లు తీసుకువెళ్లాలని, వదులైన దుస్తులు ధరించాలన్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లేవారికి తప్పకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ డాక్టర్ సిహెచ్ దివ్య, మండల వైద్యాధికారి గోపీనాథ్, మండల విస్తరణాధికారి కొండారెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.



నిరసన చేపడుతున్న దళితులు

దళిత భూముల ఆక్రమణ అన్యాయం

ప్రజాశక్తి-బిట్రగుంట

ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూములను ఆక్రమించడం అన్యాయమని దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. బోగోలు మండలం కొండబిట్రగుంట గ్రామం అరుంధతీయవాడలో ప్రభుత్వం దళిత కోసం ఇచ్చిన భూమి ఆక్రమణపై దళిత సంరక్షణ జిల్లా సమితి అధ్యక్షుడు ఎస్.మల్లి ఆధ్వర్యంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ ప్రభుత్వం ఆక్రమం వెనకబడిన దళితులకు కేటాయించిన భూములను స్థానిక నాయకులు ఆక్రమణ చేయడం అన్యాయమని వారికి కేటాయించిన భూములను వారికే ఇచ్చేలా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాసు, రాంబాబు, వాసు, అంకమ్మ, కొండ బిట్రగుంట అరుంధతీయ వాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శివజ్యోతి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో మంచిదని, తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.ఎల్.శివజ్యోతి అన్నారు. బుధవారం ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి మించింది లేదని, ప్రస్తుతం రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. అటువంటి పరిస్థితుల నుండి రైతు మామూలు స్థితికి రావాలంటే గోఆధారిత వ్యవసాయమే చేయాలన్నారు. మూడేళ్ల పాటు కష్టపడితే తర్వాత ప్రకతి వ్యవసాయానికి భూమి అలవాటుపడి పెట్టుబడులు, ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయానికి ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వంటి సేంద్రియ ఎరువులు, బీజామతం వంటి విత్తన శుద్ధి రసాయనం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కీటక నాశనులు తయారు చేసుకోవాలని, ప్రకృతి వ్యవసాయంలో కేవలం దేశీ విత్తనాలనే విత్తుకొని సొంత విత్తన భాండాగారాలను ఏ ర్పాటు చేసుకోవాలని కోరారు. సదస్సుకు వచ్చిన రైతులకు ప్లాస్టిక్ డ్రమ్ములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపిఎం మాలకొండయ్య, ఎడిపిఎం రవిచంద్రప్రసాద్, ఐటిడిఎ అనురాధ, పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త కిరంకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రపతి విందులో బిఎంఆర్

ప్రజాశక్తి-కావలి



రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పార్లమెంటు సభ్యుల గౌరవార్థం బుధవారం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటుచేసిన విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను ఆహ్వానించారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు,ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు విజయసాయిరెడ్డి, ఎపి నుండి ఎన్నిక కాబడిన రాజ్యసభ, లోకసభ సభ్యులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి

కావలి శివార్లలో నర్సింగ్ విద్యార్థులకు బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కావలి మండల పారాలీగల్ వాలంటీర్ న్యాయవాది ఐ.సాయిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై,అక్కడ వున్న నర్సులకుకొన్ని చట్టాలను వివరించారు. అలాగే సమాజంలో చెడు ప్రభావాలను విడిచి, మంచి లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ నర్సులుగా ఉద్యోగం పొంది, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలని సాయి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ నర్సులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంగ్రామయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-మర్రిపాడు

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధనలో భాగంగా మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం ఎంఆర్‌పిఎస్ జెండాను ఎంఎస్‌పి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు మాదిగ ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రం నుండి రెండో విడత మాదిగల సంగ్రామ పాదయాత్రను ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు నందిపోగు వెంగళరావు మాదిగ ప్రారంభించిన పాదయాత్రను ఎంఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎండగడుతూ ప్రతి గ్రామంలో మాదిగలను చైతన్య పరుస్తూ ఏప్రిల్ 3న జరుగు బిజెపి జిల్లా కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టో ద్వారా మాదిగలకు హామీనిచ్చిన బిజెపి నేటికి 9 సంవత్సరాలు గడిచిన నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని, ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, లేనిపక్షంలో మార్చి



యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

27, 28 తేదీల్లో మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే మహా ధర్నాకు జిల్లాల నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజక వర్గ ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి బొద్దుకూరు మహేష్ మాదిగ, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు సోంపల్లి హజరత్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు రమణయ్య మాదిగ, మహిళా నాయకురాలు ఆదిలక్ష్మి మాదిగ, ఎంఎస్‌పి నాయకులు మురళీ మాదిగ, రామయ్య మాదిగ, నరసయ్య మాదిగ, తిరుపతి మాదిగ, బుర్ర వెంగయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



మేకపాటిని కలిసిన మెట్టకూరు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని నియోజకవర్గ పరిశీలకులు మెట్టకూరు ధనుంజయరెడ్డి కలిశారు. బుధవారం విజయవాడలోని మేకపాటి స్వగృహంలో మెట్టకూరి ధనుంజయరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిస్థితులపై సుదీర్ఘ చర్చ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో మేకపాటి సలహాలు సూచనలతో పార్టీ బలోపేతంకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసేందుకు తమ వంతు కృషి నియోజకవర్గంలో చేస్తామని ముఖ్యమంత్రి ఆశించిన చరిత్ర తిరగరాయబోతున్న ఘన విజయం సాధనకు విస్తృత పర్యటన చేపట్టబోతున్నామన్నారు. ఈసారి నియోజకవర్గంలో ఊహించని రీతిలో వైసిపి ఎంఎల్ఎ ఘనవిజయం సాధించి ముఖ్యమంత్రికి కానుక ఇవ్వాలని అందుకు ప్రతికార్యకర్త నాయకులు అభిమానులు ప్రజల దీవెనల కోసం ప్రజా ఆదరణ కోసం ముందుకు సాగాలని నియోజక వర్గంలోని ప్రస్తుత రాజకీయ సమీకరణాలు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ



ప్రజాశక్తి-కావలి


స్థానిక ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలోని ఫైనల్ ఇయర్ విద్యార్థులకు విజయవాడ "నాందిఫౌండేషన్" ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగానికి అవసరమైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ మహబూబ్ మాట్లాడుతూ నాంది ఫౌండేషన్ సధరన్ హెడ్ ఎన్.శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు మహేంద్ర ఫ్లైడ్ క్లాస్ రూమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు రోజుకు ఆరు గంటల చొప్పున విద్యార్థులకు బేసిక్ టెక్నికల్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉద్యోగ కల్పనకు ఎంతగానో ఉపయోగపడే ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులకు అందిస్తున్న కళాశాల జమాన్యానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తల్లపనేని ఉమ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గొట్టిపాటి కొండపనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని మహిమలూరు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల మెయిన్ పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తెలుగులో ఇంగ్లీష్లులో ఉపన్యాసాలు సంభాషణలు వారి తల్లిదండ్రుల సమక్షంలో గ్రామపెద్దల సమక్షంలో అద్భుతంగా ప్రదర్శించారు. విద్యాపరంగా మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి దాతలు రసూల్ బీ ప్రదానం చేశారు. తుమ్మల బాబురెడ్డి ఐదవ తరగతి చదువుతున్న పిల్లలకు అట్ట బహుకరించారు. అనంతరం పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ పిల్లలు ఇంగ్లీషులో అనర్ధంగా తమ ప్రతిభను ప్రదర్శించా రని అభినందించారు. పిల్లలతో శ్రీకృష్ణదేవరాయుల ఏకపాత్రాభినయం అలాగే వివిధ వేషధారణతో పిల్లలతో అభినయం చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు పాఠశాల హెచ్‌ఎం ఎస్ కే ఇస్మాయిల్, గ్రామపెద్దలు సిహెచ్ జితేంద్రనాగ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఉద్దాల పెంచలరావు, సర్పంచ్ చంద్రశేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సిహెచ్ రమేష్, రఫీ, వెంకటేశ్వర్లు, రవీంద్రకుమార్, దయాకర్, పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లూరు

హైదరాబాదులో 11 నుండి 12 వరకు జరిగిన నాలుగవ ఆల్ ఇండియన్ సౌత్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో నెల్లూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో చదువుతున్న వేమిరెడ్డి సాయినిశిత చెస్‌లో, టి.కుసుమ వాలీబాల్‌లో మొదటి బహుమతులు సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వి.విజయ్ కుమార్, డిసిఎంఇ హెడ్ ఆఫ్ సెక్షన్ పి.పాపమ్మ, డిఇసిఇ హెడ్ ఆఫ్ సెక్షన్ ఎస్‌కె.అహ్మద్, ఫిజికల్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, కళాశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ప్రజలకు అందుబాటులో వైద్యులు

ప్రజాశక్తి-ఉదయగిరి



మాట్లాడుతున్న డిడిఒ లీలావతి

ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు అందుబాటులో ప్రభుత్వ వైద్యులు ఉన్నారని డిడిఒ లీలావతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైద్యశాలలో విలేకరులతో అమె మాట్లాడుతూ వైద్యులు అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యులు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఎక్సరే స్కానింగ్ ఈసీజీ సేవలో అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని వేళలో కాన్పులు సాధారణంగా చేస్తున్నామన్నారు. కావలి నుంచి శుక్ర, శనివారాలలో చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు అవసరమైన శిరస్సులు అందుబాటులో ఉన్నాయని ముఖ్యంగా హెచ్ 3 ఎన్ 2 వైరస్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిహెచ్ పరిధిలోని ప్రజలు అవగాహనతో చేతులు శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు భౌతిక దూరం పాటిస్తూ విధిగా మాస్కులు ధరించాలన్నారు. యాక్సిడెంట్ సీరియస్ కేసులను ప్రధమ చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం బయటకు పంపడం జరుగుతుందని కారణం సరైన సదుపాయాలు లేకపోవడంతో బయటకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శంషుద్దీన్ డాక్టర్ సింధూర పాల్గొన్నారు.

బకాయిల వివరాలపై వేమిరెడ్డి ప్రశ్న



ప్రజాశక్తి-నెల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మెటీరియల్ కాంపోనెంట్ కింద ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వం రూ.700 కోట్లు చెల్లించాల్సి ఉందనే విషయం వాస్తవమేనా అని పార్లమెంట్‌లో రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. బకాయిలను క్లియర్ చేయకపోవడం వల్ల రాష్ట్రంలో ఎంజిఎన్ఆర్ఇజిఎ అమలుపై ప్రభావం చూపుతుందా అని ప్రశ్నించారు. అలా అయితే, మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధిం చిన మెటీరియల్, వేతన బకాయిలు ఏమైనా ఉంటే ఎప్పటిలోగా క్లియర్ చేస్తుందో తెలపాలన్నారు. అందుకుగాను స్పందించిన కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది డిమాండ్–ఆధారిత వేతన ఉపాధి పథకమని తెలియజేశారు. 2022–23లో రాష్ట్రానికి రూ.6706.08 కోట్లు ఎన్ఆర్ఇజిఎస్ కింద విడుదలయ్యాయన్నారు. మెటీరియల్ కోసం, పరిపాలనా భాగాల కోసం రూ.2363.46 కోట్ల తో సహా, ఈ పథకం కింద, మొత్తం రూ.819.12 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కోసం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో వేతనాలకు సంబంధించి రూ.205.24 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు



ఆత్మకూరులో...

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్షలు ఇవాళ ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే, సమయానికి హాజరు కాకపోతే పరీక్ష కేంద్రానికి వెళ్లనివ్వమని చెప్పడంతో విద్యార్థులు 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గేట్లు ఆలస్యంగా తీయడంతో కొద్దిసేపు విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందారు. షిరిడీ సాయిరాం కళాశాల ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రానికి 281 మంది విద్యార్థులు గానూ 270 మంది హాజరై, 11 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 235 మంది విద్యార్థులకు గానూ 223 మంది హాజరు 12 మంది గైర్హాజరయ్యారు. గవర్నమెంట్ హై స్కూల్ పరీక్షా కేంద్రానికి 244 మంది విద్యార్థులకు గానూ 233మంది హాజరు కాగా 11మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి 245 మంది విద్యార్థులకు గానూ 240 మంది విద్యార్థులు హాజరై, 5 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు పరీక్షలను స్థానిక సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐలు శివశంకర్‌రావు, రాజేష్ పరీక్షలను గట్టి బందోబస్తు పగడ్బంధీగా నిర్వహించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వాసు బాబు తెలియజేశారు.

ప్రజాశక్తి-సీతారామపురం : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు జరగ్గా మొత్తం 153 మంది విద్యార్థులకు గానూ 148 మంది విద్యార్థులు హాజరయ్యారు. 5 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ రెహమాన్ తెలిపారు.



ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవ త్సరం 185 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 13 మంది విద్యార్థులు గైర్హాజరుకాగా 172మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ హనుమంతు రావు తెలిపారు. పరీక్ష కేంద్రం ఆవరణలో ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్ అమలు చేశారు.

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ అంకినీడు తెలియజేశారు. మొదటి రోజు 230 మంది విద్యార్థులు హాజరు కాగా 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆంజనేయులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మొదటిరోజు 23 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు గైహాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం కిరణ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎఆర్ఆర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 299 మందికి గానూ 276 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ పరీక్షలకు డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా నరసింహారావు స్పెషల్ ఆఫీసర్‌గా చంద్రశేఖర్ పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహించేలా ఎస్ఐ ఎన్.ప్రభాకర్ తమ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకుని గదుల నంబర్లు చూసుకుని పరీక్షా కేంద్రంలోకి వెళ్లారు. సిఐ రవి నాయక్, ఎస్ఐ నాగార్జున రెడ్డి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రంలో 213 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.